మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట



# జడ్చర్ల జలమయం



- భారీ వర్షంతో ఇండ్ల మధ్య చేరిన వర్షపు నీరు
- నేతాజీ చౌరస్తా వద్ద ట్రాఫిక్ జామ్
- ఘటన స్థలానికి వెంటనే చేరుకున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి
- రెండు గంటల పాటు వర్షంలో తడుస్తూ.. పరిస్థితిని సమీక్షిస్తూ అధికారులతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**జడ్చర్ల, జూన్ 12 ప్రభాతవార్త :** జడ్చర్ల పట్టణం మరోసారి జలమయమైంది. గురువారం కురిసిన భారీ వర్షం కారణంగా, జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని నేతాజీ చౌరస్తా వైపు వెళ్లే ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు చేరింది. ఈ కారణంగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాలనీలా రోడ్లలో వర్షపునీరు భారీగా చేరడంతో ఎటు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. డ్రైనేజీలు నిండి పొంగిపొర్లడంతో కాలనీ రోడ్లన్నీ చెరువు కాలువలను తలపించాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే జడ్చర్ల శాసనసభ్యులు అనిరుధ్ రెడ్డి తక్షణమే ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. రెండు గంటల పాటు వర్షపు నీటిలోనే రోడ్ల వెంట పర్యటిస్తూ, జనాల ఇబ్బందులను తెలుసుకొని తక్షణ సహాయం అందించారు. వర్షంలో తడుస్తూ సహాయక చర్యల్లో పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డికి ఫోన్ చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరద నీటిని రహదారికి పక్కకు మళ్లించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అంతేకాక, ట్రాఫిక్ నియంత్రణలో స్వయంగా పాల్గొని ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూసారు.





సహాయక చర్యల్లో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గత ప్రభుత్వ హయాంలో నల్లకుంట చెరువుకు నీరు చేరే ప్రధాన కాల్వలను పూడ్చి వేయడంతో పాటు, పట్టణ డ్రైనేజీ వ్యవస్థను నిర్లక్ష్యంగా నిర్వహించిన ఫలితంగా ప్రతి వర్షంలో జడ్చర్లలో ఈ సమస్యలు తలెత్తుతున్నాయి" అని విమర్శించారు. ఇలా ఉండకూడదనే ఉద్దేశంతో, తాను ఎమ్మెల్యే అయ్యాక పట్టణంలో వర్షపు నీరు నిలకడ లేకుండా సజావుగా వెళ్లిపోడానికి అవసరమైన స్ట్రామ్ వాటర్ డ్రైన్స్ నిర్మించేందుకు రూ.14 కోట్లు మంజూరు చేయించానని తెలిపారు. దీనికి సంబంధించి టెండర్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. ఎమ్మెల్యే వెంట సిఐ కమలాకర్, ఎస్ఐలు మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు బాద్మి రవిశంకర్, పెద్ది వెంకటేష్, ఉన్నారు.









చెరువులా మారిన రోడ్లు .. వర్షపునీటిలో ఆగిన వాహనాన్ని తోపుకుంటూ వెళ్తున్న వాహనదారులు,, ఇండ్ల మధ్యలో చేరిన వర్షపు నీరు

---

### తడిసిన ధాన్యం

## బోరుమంటున్న రైతులు

- సంచుల్లో నింపిన ధాన్యం లారీల్లో నింపడానికి జాప్యం
- లోడ్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు



వర్షానికి తడిసిన ధాన్యపు బస్తాలు

**నవాబుపేట, జూన్ 12 ప్రభాతవార్త :** రైతులు ఆరుగాలం పండించిన పంటను ప్రభుత్వ అధికారులకు ఐకెపి అధికారులకు విక్రయించే క్రమంలో ధాన్యం విక్రయాలకు అడుగడుగునా ఆటంకాలు ఏర్పడుతున్నాయి. టోకన్ల జారీలో, గన్ని బ్యాగుల సరఫరాలో, తూకాలు వేయడంలో, లారీల సరఫరాలో, ధాన్యం రవాణాలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఈ జాప్యం వల్ల మధ్యాహ్నం జోరుగా కురిసిన వర్షం వల్ల సంచుల్లో ఎత్తిన ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఐకెపి అధికారుల వల్ల రైతులు తడిసిన ధాన్యం బస్తాలతో బోరుమంటున్నారు. గురువారం మండల పరిధిలోని దొడ్డిపల్లి గ్రామంలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని గన్నీ బ్యాగుల్లో నింపిన ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేయడానికి నిర్లక్ష్యం వహించడం కారణంగా ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. దీంతో రైతాంగం ఐకెపి అధికారులపై గుర్రుగా ఉన్నారు. అధికారులు గమనించి సకాలంలో గన్ని బ్యాగుల విషయంలో కానీ లారీల సరఫరా విషయంలో గాని ముందు జాగ్రత్తగా వ్యవహరించి రైతులను ఆదుకోవాలని రైతులు వాపోతున్నారు.

---

### జక్లేర్ వద్ద

## రోడ్డు ప్రమాదం

**లారీని ఢీకొన్న వోల్వో బస్సు, 18 మందికి తీవ్ర గాయాలు**

**మక్తల్‌టౌన్, జూన్ 12 ప్రభాతవార్త:** మక్తల్ మండల శివారులో గల జక్లేర్ వద్ద గురువారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 30 మంది ప్రయాణికులతో ఉన్న వోల్వో బస్సు లారీని ఢీకొనడంతో 18మందికి తీవ్ర గాయాలయ్యాయి. పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్లేర్ పరిసర ప్రాంతాల్లో జరిగింది. శివమొగ్గ నుంచి దాదాపు 30 మంది హైదరాబాద్‌కి వెళ్తున్న శ్రీ దుర్గాంబా ట్రావెల్స్ బస్సు వర్షం పడుతుండటంతో ప్రమాదవశాత్తు లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కావడంతో దాదాపు 18మందికి ప్రయాణికులకు తీవ్ర గాయాలు కాగా డ్రైవర్ రెండు కాళ్ళు విరిగి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం అందింది. పలువురి ప్రయాణికుల పరిస్థితి కూడా విషమంగా ఉండగా సమాచారం అందుకున్న మక్తల్ పోలీసులు సహాయక చర్యలు చేపడుతున్నారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది. ఈ బస్సులో దాదాపు 30 మంది పైనే ప్రయాణికులు ఉన్నారు.



నుజ్జు నుజ్జయిన ఓల్వో బస్సు ముందుభాగం

---

### లబ్ధిదారులకు

## ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు

- అందజేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- సంతోషాన్ని వ్యక్తపరిచిన లబ్ధిదారులు



ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే

**శ్రీరంగాపూర్, జూన్ 12 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో గురువారం కామన్ కమ్యూనిటీ హాల్‌లో నందు ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి, జిల్లా అడిషనల్ కలెక్టర్ యాదయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడు మెగారెడ్డి మాట్లాడుతూ ఆనాడైనా ఈనాడైనా పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చింది అంటే అది ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వమే అని, నాడు పది సంవత్సరాల బంగారు తెలంగాణ దొరల పాలనలో మన శ్రీరంగాపూర్ మండలంలో ఒక్కరికి కూడా డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం – మిగతా4లో..

---

## ఎస్‌సి,ఎస్‌టిలకు న్యాయం చేసేందుకే కమిషన్

- అట్రాసిటీ, పెండింగ్ కేసులు, భూ సమస్యలు నెలలోగా పరిష్కరించాలి
- అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలలో అవకాశం కల్పించాలి
- ప్రతి నెల చివరి రోజున పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలి
- ఎస్.ఐ, తహశీల్దార్,అధికారులు,దళిత సంఘాల నాయకులు హాజరు కావాలి
- ఎస్‌సి, ఎస్ టి సబ్ ప్లాన్ నిధులు పక్క దారి పట్టిస్తే కఠిన చర్యలు
- ఎస్.సి.,ఎస్.టిల భూములు ఆక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు
- తెలంగాణ రాష్ట్ర ఎస్ సి, ఎస్.టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్ సి, ఎస్.టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 12 ప్రభాతవార్త:** జిల్లాలో ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ భాదితులకి సత్వర న్యాయం జరిగేలా చూడాలని, ఎస్.సి., ఎస్.టి.అట్రాసిటీ పెండింగ్ కేసులు జులై 12 లోగా పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి,ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్‌సి,ఎస్‌టి అత్యాచార కేసులు,భూసమస్యలు,వివిధశాఖల ద్వారా ఎస్‌సి., ఎస్‌టిలకు సంక్షేమ పథకాల అమల పై తెలంగాణ రాష్ట్ర ఎస్ సి, ఎస్ టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య,కమిషన్ సభ్యులు నీలాదేవి, శంకర్, రాంబాబు నాయక్, లక్ష్మినారాయణలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎస్‌సి.,ఎస్‌టిలకు సంబంధించిన భూ సమస్యలు కూడా నెల రోజుల్లోగా జూలై 12 నాటికి భూ భారతి నూతన చట్టం ద్వారా పరిష్కారం చేయాలని సూచించారు. ధరణి ద్వారా పరిష్కారం కాని వాటిని భూ భారతి నూతన చట్టం ద్వారా ఎస్‌సి.లు,ఎస్‌టి ల భూ సమస్యలు పరిష్కారం చేయాలని అన్నారు. పోలీస్ శాఖ ద్వారా నమోదు అయిన ఎస్.సి.,ఎస్‌టి కేసులు గురించి ఎస్.పి.డి.జానకి వివరించారు. ఈసంవత్సరం 26 కేసులు నమోదు కాగా 6ఛార్జ్ షీట్ చేసినట్లు, 20 కేసులు విచారణలో ఉన్నట్లు తెలిపారు. గత సంవత్సరం 78 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 2014 సంవత్సరం నుండి 2023 వరకు 530 కేసులకు గాను 90 కేసులు ఛార్జిషీట్ వేయలేదు కారణాలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని కోర్ట్ లో పెండింగ్,కుల ధృవీకరణ పత్రాల వలన పెండింగ్ ఉన్నట్టు తెలిపారు. కుల ధృవీకరణ సర్టిఫికెట్ పెండింగ్ ఉంటే ఎస్‌సి అభివృద్ధి అధికారి అటువంటి కేసులకు సంబంధించి జిల్లా కలెక్టర్ ద్వారా ధృవీకరణ సర్టిఫికెట్‌లు జారీ – మిగతా4లో..

---

### మహిళలకు వరంగా

## నవరత్నాలు

- ఎమ్మెల్యే యెన్నం సొంత నిధులతో ఉచితంగా శిక్షణ
- శిక్షణ పొందిన మహిళలకు 3040 వరకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు
- ఈ నెల 17 న మొదటి బ్యాచ్ అభ్యర్థులకు సర్టిఫికెట్ల ప్రధానం
- నవరత్నాలు శిక్షణా కేంద్రం పర్యవేక్షకుడు గుండా మనోహర్



మీడియాతో వివరాలు వెల్లడిస్తున్న గుండా మనోహర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 12, ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణా కేంద్రం మహిళలకు వరంగా మారిందని మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణా కేంద్రం పర్యవేక్షకులు గుండా మనోహర్ పేర్కొన్నారు. మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణా కేంద్రంలో రెండవ బ్యాచ్ పూర్తి అయిన సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఎంతో మేధోమథనం చేసి మహిళలకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఏర్పాటు చేసిన కేంద్రమే మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణా కేంద్రం అని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యే తన సొంత నిధులతో ఈ శిక్షణా కేంద్రంలో కంప్యూటర్, బ్యూటీషన్, మగ్గం వర్క్, ఫ్యాషన్ డిజైనింగ్‌లలో శిక్షణ ఉచితంగా ఇస్తున్నామని, ఇప్పటి వరకు మొదటి బ్యాచ్‌లో 217 మంది శిక్షణ పూర్తి చేసుకోగా, రెండవ బ్యాచ్‌లో 247మంది విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణా సెంటర్ లో శిక్షణ పొందిన మహిళలు 3040 వరకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించాయని, మిగతావారు కూడా తమ ఇంటి దగ్గరనే స్వయం ఉపాధి పొందుతున్నారని, ఇక్కడ శిక్షణ తీసుకొని, ఏదైనా యూనిట్ ప్రారంభించాలనుకునే వారికోసం బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు ఎమ్మెల్యే బ్యాంకు అధికారులతో మాట్లాడి రుణాలు ఇప్పిస్తూ సహకారం అందిస్తున్నారని, ఇప్పటికే మొదటి బ్యాచ్ పూర్తిచేసుకున్న కొందరు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు పొంది స్వతహాగా యూనిట్స్ ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ నెల 17 వ తేదిన మొదటి బ్యాచ్ పూర్తి చేసుకున్న వారికి మహబూబ్‌నగర్ – మిగతా4లో..

---

## కమీషన్లకు కక్కుర్తిపడి కమిషన్ ముందు అబద్ధాలు

- రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన బీఆర్ఎస్
- ఏడున్నర లక్షల కోట్ల అప్పులు మిగిల్చిన మాజీ సీఎం కేసీఆర్
- పార్టీలకతీతంగా అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు
- భూత్పూర్‌లో అబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్‌ను అందజేసిన ఎమ్మెల్యే జీఎంఆర్

**భూత్పూర్,జూన్ 12,ప్రభాతవార్త :** రాష్ట్రాన్ని గత పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ అప్పులకుప్పగా మార్చిందని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) అన్నారు. ఏడున్నర లక్షల కోట్ల అప్పులు మిగిల్చి, విచారణ కమిషన్ ముందు మాజీ సీఎం కేసీఆర్ అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. తన తప్పేమి లేదని అంతా అధికారులు,ఇంజనీర్ల ప్రమేయంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని పచ్చి అబద్ధాలు పలుకుతున్నారని విమర్శించారు. తండ్రి,కొడుకు, కూతురు,అల్లుడు కలిసి దొంగనాటకాలాడుతున్నారని ఆరోపించారు. గురువారం భూత్పూర్ పట్టణ,రూరల్ ప్రాంతాల్లోని 477మంది అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దొరికినకాడికి దోచుకుందని ఆరోపించారు. ఎన్నికల ముందు తమ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు. కమిషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని ఆరోపించారు. ప్రాజెక్టు కట్టిన ఏడాదిలోపే కుంగి పోయిందని విమర్శించారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం కోయిల్‌సాగర్,జూరాల ప్రాజెక్టు యాభై ఏళ్ల గడుస్తున్నా ఇప్పటికి చెక్కు చెదరకుండా ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం రైతు బంధు తప్పా ఏ ఒక్క పథకం రైతులకు అమలు చేయలేదని అన్నారు. తప్పుడు కూతలు



ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్

కూసే బీఆర్ఎస్ ప్రబుధులకు రాబోయే స్థానిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ నేడు అధికారం చేపట్టిన 17నెలల్లోనే వేల కోట్లతో సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో 43వేల కుటుంబాలకు 200యూనిట్ల లోపు వారికి ఉచిత విద్యుత్తును సరఫరా చేస్తున్నామన్నారు. రుణమాఫీని అమలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నిరుపేద రైతు కుటుంబానికి పెద్దకొడుకయ్యాడని పేర్కొన్నారు. రెండు లక్షల రుణమాఫీని భూత్పూర్ మండలంలో రు.60కోట్లు ఖర్చు చేసిందన్నారు. సన్న వడ్లకు బోనస్‌ను ప్రకటించి, రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పేదలకు పంచుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పద్మానరేందర్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు మొల్గర మందడి నర్సింహ్మారెడ్డి, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌కుమార్‌గౌడ్‌లతో పాటు మండల స్పెషలాఫీసర్ వేణుగోపాల్, తహశిల్దార్ కిషన్ నాయక్, ఎంపీడీఓ ప్రభాకర్‌చారి, మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్ ఇతర కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ ఇళ్లలబ్ధిదారులు పాల్గొన్నారు.

పట్టణ కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్ భూత్పూర్ పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. పట్టణంలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసిన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్‌ను ఎమ్మెల్యే జీఎంఆర్ అభినందించారు.

## ఈద్గా స్థలాన్ని పరిరక్షించాలని వినతి

**ఉప్పునుంతల, జూన్ 12 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల మర్రి పల్లి మార్గంలో ఉన్న మైనార్టీల ప్రార్థన స్థలమైన ఈద్గాను పరిరక్షించాలని కోరుతూ మండల మైనార్టీ కమిటీ సభ్యులు గురువారం స్థానిక తహసిల్దార్ ప్రమీలకు వినతి పత్రాన్ని అందజేశారు .ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల ప్రకారం 14 గుంటల స్థలాన్ని ముస్లిం, మైనార్టీల స్మశాన వాటిక,పండుగ రోజుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసుకోవడానికి ఈద్గా కు స్థలాన్ని కేటాయించినట్లు వారు వెల్లడించారు. ఈ స్థలాన్ని పొరుగు రైతులు ఆక్రమిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణకు గురవుతున్న ఈద్గా, ముస్లిం, మైనార్టీల స్మశాన వాటికను పరిరక్షించాలని వారు కోరారు. స్పందించిన తహసిల్దార్ రెవెన్యూ రికార్డుల ప్రకారం ఈద్గా స్మశాన వాటికకు సంబంధించిన హద్దులు నిర్ధారించి నివేదిక ఇవ్వాల్సిందిగా మండల సర్వేయర్‌ను ఆదేశించినట్లు తహసీల్దార్ తెలిపారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మైనార్టీ సోదరులు

## రాజోలి ఎస్సైపై బదిలీ వేటు



**మానవపాడు, జూన్ 12 ప్రభాతవార్త :** రాజోలి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వ ర్తిస్తున్న ఎస్సై జగదీష్‌పై వేటు పడింది. ఆయనను జిల్లా పోలీసు కార్యాల యానికి అటాచ్ చేస్తూ పోలీస్ శాఖ ఉన్నత అధికారులు శాఖపరమైన చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా ఆయన గతనెల రాజోలి మండలం చిన్న ధన్వాడ గ్రామానికి చెందిన ఓ దళిత కుటుంబం అన్నదమ్ముల భూ వివాదాల్లో కలగజేసుకుని దాడికి పాల్పడమే కాక సరైన విధంగా స్పందించలేదని ఆ రోపణలు వినిపించాయి. అయితే ఈనెల 10 న తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంక టయ్య గద్వాల జిల్లా కేంద్రానికి వచ్చారు. వారు ఎస్సైపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. కమిషన్ నుండి వచ్చిన ఫిర్యాదు మేరకు చేపడుతున్న విచారణలో భాగంగా రాజోలి ఎస్సైను జిల్లా పోలీస్ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు గురువారం తెలిపారు.

## రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

### మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్

**ఉప్పునుంతల, జూన్ 12 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకానికి అర్హత కలిగిన రైతులందరూ ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కొర్ర రమేష్ తెలిపారు. మండలంలోని 290 మంది రైతులు రైతు భరోసా పథకానికి అర్హత కలిగి ఉన్నారని, అట్టి వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంతో వెల్లడించారు. ఆయా క్లస్టర్ల పరిధిలోని వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, పాస్ పుస్తకము, పట్టాదారు పాస్ పుస్తకాల జిరాక్స్ జత చేసి అందజేయాలని ఆయన కోరారు. క్లస్టర్ల వారిగా రైతుల వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పునుంతల 58, వెల్టూరు 57, పెనిమిళ్ళ 35, మామిళ్ళపల్లి 45, గట్టు కాడిపల్లి 29, మర్రిపల్లి 24, పిరట్వాన్ పల్లి 42 మంది రైతులు అర్హత కలిగి ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## బాలల హక్కుల చట్టాలపై అవగాహన సదస్సు

**నారాయణ పేట, జూన్ 12 ప్రభాతవార్త :** ప్రపంచ బాల కార్మికుల వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ బాలల పరిరక్షణ విభాగం నారాయణపేట జిల్లా వారి ఆధ్వర్యంలో గొల్లపల్లి గ్రామంలో బాలల హక్కులు చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ బాలల హక్కులు గురించి బాలల చట్టలు అయినా బాల్య వివాహ నిషేధ చట్టం 2006 బాలకార్మిక చట్టం గురించి అవగాహన కల్పించారు. విద్యా హక్కుచట్టం లైంగిక నేరాల నుండి పిల్లలకు రక్షణ కల్పించే చట్టం గురించి అవగాహన కల్పించారు. మక్తల్ సిడిపిఓ సరోజినీ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల ప్రాముఖ్యత అంగన్వాడీలో గర్భిణీలకు పిల్లలకు అందించే పౌష్టిక ఆహారం గురించి మాట్లాడడం జరిగింది. మొబైల్ ఫోన్ వల్ల కలిగే నష్టాలు అనాథ పిల్లలు గురించి చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098 గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం విజయ్ కుమార్, సిడిపిఓ సరోజిని సూపర్‌వైజర్ అరుణ, విజన్ ఎన్జీవో డిస్టిక్ కోఆర్డినేటర్ చాపల రవి, గ్రామ పంచాయతీ సెక్రెటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసు, ఉపాధ్యాయ బృందం, అంగన్వాడి టీచర్లు, గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.



అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

## వీరాపురంలో కొనసాగిన రెవెన్యూ సదస్సు

**ఇటిక్యాల, జూన్ 12 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ స్థానంలో కొత్తగా భూభారతి చట్టం తీసుకురావడంతో గ్రామీణ ప్రాంతాలలో భూ సమస్యలు ఎదుర్కొంటున్న రైతుల సమస్యలను పరిష్కరించేందుకు గాను ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను కొనసాగిస్తుండగా గురువారం మండల పరిధిలోని బి. వీరాపురం గ్రామంలో తాహసిల్దార్ నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించగా గ్రామంలో 4 దరఖాస్తులు వివిధ భూ సమస్యలు పరిష్కరించాలని రైతులు దరఖాస్తులు చేసుకున్నట్లు తహసిల్దార్ నరేష్ తెలిపారు. ఈనెల 5వ తేదీ నుండి మండలంలో భూ రెవెన్యూ సదస్సులు ప్రారంభించగా మండలంలో మొత్తం 11 రెవిన్యూ గ్రామాలుఉండగా ఇప్పటివరకు బట్లదీన్నె,కొండేరు,ధర్మవరం,తిమ్మాపురం,వల్లూరు,రాజశ్రీ గార్లపాడు, వేముల గ్రామాలలో రెవెన్యూ సదస్సులు పూర్తయినట్లు శుక్రవారం పటాన్‌దొడ్డి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఎర్రవల్లి మండలతహసిల్దార్ నరేష్ తెలిపారు. ఈకార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నరేష్, ఆర్ఐలు షంషీర్, శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో రైతులతో మాట్లాడుతున్న తహసిల్దార్ నరేష్

## రాచూర్ తండాలో రేషన్ దుకాణం ఏర్పాటు

### -ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు

**వెల్దండ, జూన్ 12 ప్రభాతవార్త:**వెల్దండ మండల పరిధిలోని రాచూర్ తండాలో గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాలతో కాంగ్రెస్ నాయకులు హరికిషన్ నాయక్ రేషన్‌షాపును ప్రారంభించారు. రాచూర్‌తండాకు సంబంధించిన రేషన్ షాపు దుకాణం తిమ్మినోనీపల్లి గ్రామంలో ఉండటంతో తండావాసులు 2 కిలోమీటర్ల దూరం నడిచి రేషన్ బియ్యం తీసుకునే వారు. దీంతో మహిళలు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లడంతో ఎమ్మెల్యే అధికారులను రాచూర్ తండాలో రేషన్ బియ్యం అందజేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో రాచూర్ తండాలో రేషన్ బియ్యం పంపిణీ చేసే దుకాణం ప్రారంభించారు. తండాలో రేషన్ బియ్యం అందజేసే షాపును ప్రారంభించినందుకు ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణరెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గోపాల్, నరేష్, శ్రీనివాస్, గోపాల్, కిషన్ నాయక్, కృష్ణానాయక్, రెడ్యానాయక్, రత్నమ్మ, సాలి, చక్రి, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.



రేషన్ దుకాణంలో సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

## ఫార్మసిస్ట్ ఉద్యోగానికి దరఖాస్తు ఆహ్వానం

### డీఎంహెచ్ఓ డా.కె.జయచంద్రమోహన్

**నారాయణపేట ప్రతినిధి జూన్ 12 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాంలో గల ఫార్మసిస్ట్ ( కాంట్రాక్ట్ విధానములో ) పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని డా. కె.జయచంద్రమోహన్ జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి గురువారం ఒక ప్రకటనలో తెలియజేయడం జరిగింది. దరఖాస్తు స్వీకరణ ఈ నెల 16 ఉదయం 11:00 గం.ల నుండి సాయంత్రం గం.ల వరకు అన్నీ పని దినములలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి సమర్పించగలని తెలిపారు దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేదీ ఈ నెల 23 సాయంత్రం 05:00 గం.ల. వరకు మాత్రమే ఉంటుందన్నారు. మిగతా వివరాల కోసం వెబ్సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు నారాయణపేట్.జిఓవి.ఇన్‌ను చూడాలని సూచించారు.

# జీవోల ప్రకారమే వార్డుల విభజన

### కాంగ్రెస్ గెలుస్తుందనే అక్కసుతోనే ప్రతిపక్షాల కుట్ర

### సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్

**మహబూబ్‌నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందనే అక్కసుతోనే ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్. వినోద్ కుమార్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి, నియోజకవర్గంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమానికి చూసి కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్లో వార్డుల విభజన విషయంలో ఆశాస్త్రీయంగా ఉందని ప్రతిపక్ష నాయకులు ఫిర్యాదులు చేయడం జరిగిందన్నారు. కార్పొరేషన్లో 60 సీట్లు కాంగ్రెస్ గెలుస్తుందన్న వాస్తవాన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయని ఆరోపించారు. జీవో ప్రకారం అధికారులు వార్డుల విభజన చేస్తున్నట్లు తెలిపారు. అభ్యంతరాలపై ప్రతిపక్షాలు ఫిర్యాదులు ఇచ్చారనీ, ఫైనల్ లిస్టు వచ్చే వరకు వేచిచూడాలని హితవు పలికారు. ప్రతిపక్ష మాటలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడగడానికి చేతగాక ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాల మాటలను ప్రజలు నమ్మరని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతామనే భయం ప్రతిపక్ష పార్టీల్లో నెలకొందన్నారు. నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పాలమూరు యూనివర్సిటీలో లా, ఇంజనీరింగ్ కళాశాలల మంజూరుతోపాటు యువతకు పోటీపరీక్షలకు ఉచిత కోచింగ్ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు అజ్మత్ అలీ, నాగరాజు, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.




మీడియాతో మాట్లాడుతున్న వినోద్ కుమార్

# కొత్త తండాలో అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి

### ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు

**జడ్చర్ల, జూన్ 12 ప్రభాతవార్త:** జడ్చర్ల మండల పరిధిలోని కొత్త తండాలో అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరెకరాలను కేటాయించి తండా వాసులకు ప్లాట్లు చేసి అందివ్వగా కొంత స్థలం మిగలడంతో అక్కడ కొందరు కబ్జాదారులు ఆక్రమించారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు తండా వాసులు వినతి పత్రం అందజేశారు. కొత్త తండాలో సర్వే నంబర్స్ 135/2,135/3 మల్లెబోయిన్ పల్లి శివారు ప్రాంతంలో అప్పట్లో రూ.500 చెల్లించి పట్టాదారు నుంచి ప్రభుత్వం సేకరించి 6 ఎకరాల పట్టభూమిని నిరుపేద గిరిజనులకు ప్లాట్లు,ఇందిరమ్మ ఇళ్లు కేటాయించి కొత్త తండాను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మిగిలిన కొన్ని ప్లాట్లలో తండా అభివృద్ధికొరకు గ్రామ పంచాయతీ,మినీ ఫంక్షన్ హాల్, అంగన్‌వాడీ భవనం వంటి వాటిని నిర్మించి, ఉపయోగించాలని నిర్ణయించారు. కొందరు దళారులు, అసాంఘిక శక్తులు కుమ్మకై మొహమ్మద్ సల్మాన్ అనే వ్యక్తి నుండి 2023వ సంవత్సరంలో 20 గుంటల భూమిని ప్రభుత్వ ఉద్యోగి అయిన కేతవత్ గోవింద్ నాయక్, కేతవత్ సక్రు నాయక్ అనే వ్యక్తులు గుంటల్లో అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకుని దానికి నాలా కన్వర్షన్ చేయించి,నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌గా మార్చి ఇతరులకు అక్రమ రిజిస్ట్రేషన్ చేసి అక్రమ నిర్మాణాలను చేపట్టారని తెలిపారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని గతంలో ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆరోపించారు.

కొత్త తండా గ్రామానికి జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టి, అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించి,తండా అభివృద్ధికి కొరకు గ్రామ పంచాయతీ, మినీ ఫంక్షన్ హాల్, అంగన్వాడీ భవనం వంటి వాటిని నిర్మించే విధంగా స్థలాన్ని కాపాడాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో వడత్యా వత్ రమేష్ ,నేనవత్ శంకర్ నాయక్,భద్రు నాయక్, చందర్ నాయక్, ఆనంద్ నాయక్, ధనుంజయ నాయక్, లక్ష్మణ్ నాయక్, రఘు నాయక్, మంజునాథ్, రమేష్ నాయక్, రాజేష్ నాయక్,రాజు నాయక్, అనిల్ నాయక్,గోపాల్ నాయక్,సుధాకర్, ఉమ్లు నాయక్ తదితరులు ఉన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న తండావాసులు

# భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి

### ఉప తహసీల్దార్ పరుష్ నాయక్

**ఉప్పునుంతల, జూన్ 12 ప్రభాతవార్త :** భూ సమస్యలను పరిష్కరించడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా భూ భారతి కార్యక్రమాన్ని చేపట్టిందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగ పర్చుకోవాలని ఉప తహసీల్దార్ పరుష్ నాయక్ పిలుపు నిచ్చారు. గురువారం మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో భూభారతి చట్టం 2025 అమలుపై నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో ఉప తహసీల్దార్ పరుష్ నాయక్ పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ప్రమీల పాల్గొని రైతుల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు దరఖాస్తుల స్వీకరణ పారదర్శకంగా జరగాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత చాలా సంవత్సరాల నుంచి భూ సమస్యలతో ఇబ్బంది పడుతున్న రైతులకు ఆ సమస్యలను పరిష్కరించ కోసం భూభారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం పరుచు కోవాలన్నారు.అనంతరం రైతు భూ సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలో పెద్దాపూర్ నుంచి 30 దరఖాస్తులు రాగా, తిప్పాపూర్ నుంచి 7 దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రమీల,ఉప తహసీల్దార్ పరుష్ నాయక్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుజాత, సీనియర్ అసిస్టెంట్ బాల్ రాం నాయక్, జూనియర్ అసిస్టెంట్ అబ్రహార్, సిబ్బంది శంకర్, సాయి, ఆదిత్య, శివ, స్వప్న, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

**నేడు శుక్రవారం....** మండలంలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో భాగంగా మండలంలో వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించడం జరిగిందని, అదేవిధంగా నేడు శుక్రవారం మండలంలోని అయ్యవారి పల్లి, దాసర్లపల్లి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రమీల తెలిపారు. ఈ సదస్సులకు రైతులు సకాలంలో హాజరయ్యి సదస్సులు విజయవంతం చేస్తూ తమ సమస్యలను అర్జీల ద్వారా విన్నవించుకోవాలని ఆమె కోరారు.





రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఉప తహసీల్దార్ పరుష్ నాయక్

# ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు పెంచాలి..

### జిల్లా ఇంటర్ విద్యాధికారి అంజయ్య

**ఆత్మకూర్ జూన్ 12, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ కళాశాలలను అభివృద్ధి చెందించాలనే ఉద్దేశంతో ప్రతి ప్రభుత్వ కళాశాలలో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అడ్మిషన్లు పెంచేందుకు ప్రతి లక్షల తమ వంతు కృషి చేయాలని వనపర్తి జిల్లా ఇంటర్ విద్యాధికారి అంజయ్య విజ్ఞప్తి చేశారు. గురువారం రోజు ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి పలు రికార్డులను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు పెంచేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అందుకు కావలసిన సదుపాయాలు విద్యార్థిని విద్యార్థులకు సమకూర్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లుగా ఆయన తెలిపారు కళాశాలలో పనిచేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడు ఒక్కొక్కరు 15 మంది విద్యార్థినీ విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలో చేర్పించే విధంగా లక్ష్యం నిర్ణయించుకోవాలని ఆయన సూచించారు ఈ సందర్భంగా కళాశాలలోని తరగతి గదులను పరిశీలించడం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు ఇంటర్ జిల్లా విద్యాధికారి అంజయ్య సర్వీసును 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఆత్మకూర్ కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ భాగ్య వర్ధన్ రెడ్డి ఉపాధ్యాయ సిబ్బంది టీజే విశ్వేశ్వర్ తదితరులతో పాటుగా పలువురు పాల్గొన్నారు.



ప్రభుత్వ కళాశాలలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారి అంజయ్య

## క్రీడల శాఖ మంత్రిని సన్మానించిన జిల్లా అధ్యక్షులు



క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని సన్మానిస్తున్న నాయకులు

**వెల్దండ, జూన్ 12 ప్రభాతవార్త:** రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని చెరుకూరు గ్రామానికి చెందిన ముదిరాజ్ మహాసభ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు నూకం వెంకటయ్య హైద్రాబాద్‌లో మంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ముదిరాజ్ కులస్తుల సమస్యల పరిష్కారం కృషి చేయాలని ఆయన మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ రాష్ట్ర ఉపధ్యక్షులు బల్ల సత్తయ్య, రాష్ట్ర కార్యదర్శి యాదయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

## టియుసిఐ నూతన కమిటీ ఎన్నిక

**అమరచింత ,జూన్ 12 ,ప్రభాతవార్త:** అమరచింత మండల కేంద్రంలోని నిర్వహించిన టియుసిఐ వనపర్తి జిల్లా ప్రథమ మహాసభలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా టియుసిఐ వనపర్తి జిల్లా నూతన కమిటీని టియుసిఐ రాష్ట్ర కార్యదర్శి, కె. సూర్యం ఆదేశాల మేరకు గురువారం నూతన కమిటీని ప్రకటించారు. టియుసిఐ వనపర్తి జిల్లా అధ్యక్షులుగా ప్రసాద్, టియుసిఐ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులుగా సి. రాజు, టియుసిఐ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పి.అరుణ్ కుమార్, టుయుసిఐ సహాయ కార్యదర్శి గణేష్, టియుసిఐ జిల్లా కోశాధికారి ఏదుట్ల కురుమయ్య, జిల్లా కమిటీ సభ్యులుగా సామేలు, ప్రేమ రత్నం, ఎన్ శ్రీను, చెన్నయ్య, కిష్టన్న, సహిదా, సుబ్బయ్య, రాజు, రంగన్న, వీరితోపాటు కోఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు.

## ప్రభుత్వ బడిలోనే పిల్లలకు ఉజ్వల భవిత

### మండల విద్యాశాఖ అధికారి బాలాజీ




బడిబాట నిర్వహిస్తున్న దృశ్యం

**నారాయణపేట, జూన్ 12 ప్రభాతవార్త :** నైపుణ్యం గల ఉపాధ్యాయుల బోధనతో ప్రభుత్వ బడుల్లోనే పిల్లలకు ఉజ్వలమైన భవిష్యత్తు నిర్మాణం అవుతుందని నారాయణపేట మండల విద్యాశాఖ అధికారి, తపస్ జిల్లా కార్యదర్శి రవికుమార్ అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం బడిబాట ప్రచార రథం మండలంలోని అమ్మిరెడ్డిపల్లి, అప్పంపల్లి, బసిరెడ్డిపల్లి, బొమ్మన్ పాడ్ పాఠశాలలకు వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తపస్ సామాజిక బాధ్యతతో చేస్తున్న వినూత్న ప్రచార కార్యక్రమాన్ని అయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చిన్న నరసింహులు, తపస్ నాయకులు లింబ్యా నాయక్, శ్రీకాంత్, రాములు, విశ్వనాథ్, భాగ్య రాజ్, వెంకట్రాములు, శంకర్, వాల్యానాయక్, పాండు, శ్రీను గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

**ఇటిక్యాల, జూన్ 12 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు గురువారం పునః ప్రారంభమయ్యాయి. పాఠశాలలో ప్రారంభం కావడంతో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. దాదాపుగా గత వారం రోజులుగా పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేస్తున్నామని పదవ తరగతి సబ్జెక్టులు మాత్రమే పూర్తిస్థాయిలో వచ్చినట్లు మిగతా క్లాసులకు సంబంధించి పాఠ్య పుస్తకాలు పూర్తిగా రాలేదని ప్రభుత్వం మిగిలిన సబ్జెక్టులకు సంబంధించి ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసిన వెంటనే సంబంధిత పాఠశాలలకు పంపిణీ చేస్తామని విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం పాఠశాలలో ప్రారంభం కావడంతో మండలంలోని అన్ని పాఠశాలలు తెరచుకున్నాయని మొదటి రోజు కావడంతో ఎక్కువ శాతం విద్యార్థుల హాజరు కాలేకపోయారు.

# జాతీయ రహదారిపై జరిగే రోడ్డు ప్రమాదాలను అరికడదాం

### బొందల కుంట గ్రామం వద్ద ప్రమాద ఘటనా స్థలిని పరిశీలించిన జిల్లా ఎస్పీ

**మక్తల్ టౌన్, జూన్ 12 ప్రభాతవార్త :** మండల పరిధిలోని బొందలకుంట గ్రామ స్టేజి వద్ద తెల్లవారుజామున 167 జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుండి ఓల్వో బస్సు ఢీకొనడం వల్ల అందులో ఉన్న 18 మందికి గాయాలు అయినందున జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ సంఘటన స్థలానికి వెళ్లి రోడ్డు ప్రమాదం జరిగిన విధానాన్ని పరిశీలించి క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు తెలిపారు. సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వోల్వ బస్సు కర్ణాటకలోని శివమొగ్గ నుండి హైదరాబాద్ వెళ్తుండగా మక్తల్ మండలం బొందలకుంట గ్రామ స్టేజ్ దగ్గర లారీ రిపేరు నిమిత్తం ఆగి ఉన్నందున హైవే పెట్రోలింగ్ పోలీసులు లారీని గమనించి అక్కడ కోన్స్ అడ్డుగా ఏర్పాటు చేయడం జరిగిందని అయినా బస్సు డ్రైవర్ వేగంగా, నిర్లక్ష్యం వల్ల మరియు వర్షం పడినందున రోడ్డు ప్రమాదం జరిగిందని తెలిపారు. జిల్లా పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులతో రివ్యూ మీటింగ్స్ నిర్వహించి ఎక్కడెక్కడ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించి అక్కడ సైన్ బోర్డ్స్, డంబుల్ ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లు, రేడియం స్టిక్కర్లు వేయించడం జరుగుతుందని మరియు పోలీస్ శాఖ తరఫున బారికేడ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అయినా అనుకోకుండా అక్కడ కూడా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని పూర్తి స్థాయిలో నివారించడానికి తగిన చర్యలు తీసుకుంటామని ప్రధాన రహదారిపై వాహనాలు నిల్పకుండా హైవే పెట్రోలింగ్ పోలీసులు మరియు లోకల్ పోలీసులు నిరంతరం హైవే పై పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఉంటారని వాహనదారులు సాధ్యమైనంతవరకు రోడ్డు ప్రక్కల ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలన్నీ నిల్పాలని కోరారు. అనుకోకుండా వాహనాల రిపేరు ఏర్పడిన రోడ్డుపై తగిన సూచికలను ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు నివారించాలని అధికారులకు తెలియజేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఎస్పీతో పాటు మక్తల్ సీఐ రాంలాల్, ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి ఉన్నారు.




మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

## ప్రభుత్వ బడిలోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు

### మండల విద్యాశాఖ అధికారి బాలాజీ



బడిబాట ప్రచార రథం కార్యక్రమం సందర్శించిన తపస్ జిల్లా కార్యదర్శి రవికుమార్

**నారాయణపేట టౌన్, జూన్12 ప్రభాతవార్త:** నైపుణ్యం గల ఉపాధ్యాయుల బోధనతో ప్రభుత్వ బడుల్లోనే పిల్లలకు ఉజ్వలమైన భవిష్యత్తు నిర్మాణం అవుతుందని నారాయణపేట మండల విద్యాశాఖ అధికారి బాలాజీ, తపస్ జిల్లా కార్యదర్శి రవికుమార్ అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం బడిబాట ప్రచార రథం గురువారంనారాయణపేట మండలం మండలంలోని అమ్మిరెడ్డిపల్లి, అప్పంపల్లి, బసిరెడ్డిపల్లి, బొమ్మన్ పాడ్ గ్రామాలను సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తపస్ సామాజిక బాధ్యతతో చేస్తున్న వినూత్న ప్రచార కార్యక్రమాన్ని అయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చిన్న నరసింహులు, తపస్ నాయకులు లింబ్యా నాయక్, శ్రీకాంత్, రాములు, విశ్వనాథ్, భాగ్య రాజ్, వెంకట్రాములు, శంకర్, వాల్యానాయక్, పాండు, శ్రీను, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నేటి బిజెపి నిరాహార దీక్షను విజయవంతం చేయండి

**నారాయణపేట టౌన్, జూన్ 12 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో ప్రజా వైద్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13న నిర్వహించే బిజెపి నేతల 24 గంటల నిరాహార దీక్షను విజయవంతం చేయాలని జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్ కోరారు. నిరాహార దీక్ష స్థలాన్ని గురువారం బిజెపి రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ,కే. రతంగ్ పాండు రెడ్డి,జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ పరిశీలించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ఉన్న ఆసుపత్రిని పట్టణానికి 12కిలోమీటర్ల దూరంలో ఉన్న అప్పక్ పల్లికి తరలించడాన్ని నిరసిస్తూ తలపెట్టిన ఆసుపత్రి కోసం బీజేపీ 24 గంటల దీక్ష చేపట్టే దీక్షకు మద్దతు తెలపాలని కోరారు. ఈ నిరాహార దీక్ష సత్యనారాయణ స్వామి చౌరస్తాలో ఉదయం 10 గం.లకు ప్రారంభం అవుతుందని దీక్షలో బిజెపి రాష్ట్ర సీనియర్ నేతలు నాగు రావు నామాజీ,కె.రతంగ్ పాండురెడ్డి,జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ పాల్గొంటారు. ఈ దీక్షకు పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## పీఎం మత్స్య సంపద సమృద్ధి యోజన కిసాన్ క్రెడిట్ కార్డు పై అవగాహన సదస్సు



**నారాయణపేట ప్రతినిధి, జూన్ 12 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి మత్స్య సంపద సమృద్ధి యోజన కిసాన్ క్రెడిట్ కార్డు (పిఎంఎంఎస్ఎస్ వై కేసిసి) అవగాహన సదస్సు గురువారం రోజు మాగనూరు మండల కేంద్రంలో జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఏ.కాంత కుమార్ ముదిరాజ్ జిల్లా మత్స్యశాఖ అధికారి రెహమాన్, ఎల్‌డిఎం విజయ్ కుమార్ జిల్లా మత్స్య శాఖ డైరెక్టర్లు బి ఆంజనేయులు,గేట్ హనుమంతు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా మత్స్య శాఖ అధ్యక్షులు కాంత్ కుమార్ మాట్లాడుతూ పిఎంఎంఎస్ఎస్‌వై కేసిసి కింద వచ్చే వివిధ రకాల లోన్ల కోసం మత్స్య కారులు అప్లై చేసుకుని లబ్ధి పొందవలసిందిగా కోరడం జరిగింది. జిల్లా డైరెక్టర్, మాగనూర్ మత్స్య శాఖ అధ్యక్షులు ఆంజనేయులు మాట్లాడుతూ మహిళా మత్స్య సహకార సంఘాలు ఏర్పాటు విషయంలో కొత్త సభ్యత్వాలు చేర్చుకోవడంపై జిల్లా మత్స్యశాఖ అధికారి రెహమాన్‌లను అడగడం జరిగిందని అందుకు అధికారి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో మాగనూరు మండల వివిధ గ్రామాల మత్స్యశాఖ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు,సెక్రటరీలు సభ్యులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## జిల్లా ఎస్పిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఆర్టిఏ మెంబర్ పోషల్ రాజేష్



ఎస్పీని కలిసిన జిల్లా ఆర్టిఏ మెంబర్ పోషల్ రాజేష్

**నారాయణపేట, జూన్ 12 ప్రభాతవార్త:** గురువారం మధ్యాహ్నం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్‌ని ఆర్టిఏ మెంబర్ పోషల్ రాజేష్‌ని శాలువాతో సన్మానించారు. అనంతరం ఆర్టిఏ మెంబర్ రాజేష్ జిల్లా ఎస్పీకి మర్యాదపూర్వకంగా పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు రవాణా భద్రత కార్యక్రమంలో పాల్గొంటూ ఎలాంటి ప్రమాదాలకు తావివ్వకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీపై కూడా ఉన్నదని సూచించడం జరిగింది. సంబంధిత అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి నెల జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే రోడ్ సేఫ్టీ మీటింగ్‌కు రావాలని సూచించారు. ముఖ్యంగా జాతీయ రహదారి 167 రాయచూరు రోడ్డులో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతూ ఉంటాయి వాటి నివారణకు సంబంధిత అధికారులు నిర్వహించే రోడ్డు భద్రత మహోత్సవాలకు ఇకనుండి మీరు కూడా ఇందులో భాగం కావాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలలు ప్రారంభంఅవుతున్నాయి కాబట్టి స్కూల్‌బస్ డ్రైవర్లకు అవగాహన సదస్సు గత సంవత్సరం నిర్వహించారు ఈ సంవత్సరం కూడా నిర్వహిస్తామని ఆయన తెలియజేశారు. ఇకముందు జరిగే రోడ్డు భద్రతకు సంబంధించిన అన్ని కార్యక్రమలలో పోలీసు శాఖ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కురువ మనోజ్, సిద్దన్ లక్ష్మణ్, జరంగ్ రాము, గొల్లఅవుటి, వీరేష్ కుమార్, మాజీ కౌన్సిలర్ కార్తీక్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అసనుద్దీన్ పాల్గొనడం జరిగింది.

## మున్సిపాలిటీ అధికారుల పర్యవేక్షణ ప్రతి వార్డుపై ఉండాలి

**నారాయణపేట టౌన్, జూన్ 12 ప్రభాతవార్త:** మున్సిపాలిటీ అధికారుల పర్యవేక్షణ ప్రతి వార్డుపై ఉండాలని 21వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎరుకలి వెంకటయ్య అన్నారు. మున్సిపాలిటీ సిబ్బంది వార్డుల్లో చెత్తను తొలగించడంలో నిర్లక్ష్యం వీడి వార్డులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడాలన్నారు. పరిశుద్ధ కార్మికులు నిర్లక్ష్యం చేయకుండా చెత్తను తొలగించా లన్నారు. పట్టణంలోని గురుడువాడీలో రోడ్డుపైన చెత్త ఉండడంతో ఎవరు పట్టించుకోకపోవడంతో మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులను పిలిపించి చెత్తను తొలగింప చేశారు. రోడ్డుపై అడ్డంగా ఉన్న చెత్తను తొలగించడం పట్ల కాలనీవాసులు అభినందించారు. వార్డులపై మున్సిపాలిటీ అధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. కానీవాసులు సమస్యలు చెప్తే తప్ప పట్టించుకోవడం లేదన్నారు.



చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాం పంపిణీ

**నారాయణపేట టౌన్,జూన్12 ప్రభాతవార్త:** నూతన విద్య సంవత్సరం సందర్భంగా దామరగిద్ద మండలం మల్ రెడ్డిపల్లి యుపిఎస్ పాఠశాలలో చదివే విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలతో పాటు,నోట్ బుక్‌లు, దుస్తులను గ్రామ నాయకులు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ చంద్రంతో పాటు పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలతోనే నాణ్యమైన విద్య అన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిందన్నారు. నాయకులు శివకుమార్, గోపాల్, బాలరాజ్, అశోక్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



# నీతి నిజాయితితో విధులు నిర్వర్తించాలి

- ■ మారుతున్న సమాజానికి అనుగుణంగా పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి
- ■ ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా సానుభూతితో ప్రవర్తించాలి
- ■ విధుల్లో ప్రతిభ కనపర్చిన సిబ్బందికి సన్మానం
- ■ వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



జిల్లా పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ

**వనపర్తి క్రైమ్, జూన్12 ప్రభాతవార్త:** నీతి, నిజాయితీతో పనిచేసే వారికి పోలీసు శాఖలో ఎల్లప్పుడూ ప్రత్యేక గుర్తింపు ఉంటుందని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ భవనలో జిల్లాలో అన్ని పోలీస్టేషన్లో విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది పాత్ర కీలకమని జిల్లాలో పోలీసులు పోలీస్టేషన్లలో నిర్వహిస్తున్న విధులు సంతృప్తికరంగా ఉన్నాయని అన్నారు. పోలీసుశాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ కలిగి ఉండాలని, భాద్యతగా తమ విధులను నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించాలని పోలీసు వృత్తి నిర్వహణలో నైపుణ్యాలను పెంచుకోవాలని అన్నారు. పోలీస్ స్టేషన్‌కు వివిధ రకాలైన అభ్యర్థనలు, ఫిర్యాదులు, సమాచారం, సహాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా ఉండాలని వారి సమస్యను సావధానంగా విని పోలీస్ స్టేషన్లో న్యాయం జరుగుతుందని నమ్మకం, భరోసా,భద్రత కల్పించాలని తెలిపారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని, వివిధ వర్టికల్ విభాగాలలో మంచి ప్రతిభ కనబరచాలని, జిల్లా ఐటి సెల్ సేవలను వినియోగించుకొని, వర్టికల్ విభాగంలో వనపర్తి జిల్లాను ముందు వరుసలో నిలపడానికి కృషి చేయాలని ఎస్పీ సూచించారు. అనంతరం విధుల్లో మంచి ప్రతిభ కనబడుచిన పోలీసు సిబ్బందిని ఎస్పీ శాలువా మెమెంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బీ డీఎస్పీ,ఉమామహేశ్వరరావు, వనపర్తి సిఐ, కృష్ణయ్య, ఆత్మకూరు సిఐ, శివకుమార్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్, అప్పలనాయుడు, డిసిఆర్బీ ఎస్సై, రవి ప్రకాష్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పోలీసులు

## పండుగ వాతావరణాన్ని తలపించేలా పాఠశాల పునః ప్రారంభ సంబరాలు

● పాఠశాలల్లో మామిడి తోరణాలతో అలంకరణ

**ఉప్పునుంతల, జూన్12 ప్రభాతవార్త:** ఏప్రిల్ 24 నుంచి వేసవి కాలం సెలవులతో గడిపిన విద్యార్థిని,విద్యార్థులకు గురువారం పాఠశాలలు పునః ప్రారంభం అయ్యాయి. సుధీర్ఘంగా వేసవి సెలవుల్లో ఎంతో ఉత్సాహంగా గడిపిన విద్యార్థులు పాఠశాలలో పునః ప్రారంభం కావడంతో సెలవులకు స్వస్తి పలికి బడిబాట పట్టారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో మామిడాకు తోరణాలతో అలంకరించి పాఠశాల ప్రారంభించారు. గత కొన్ని రోజుల నుంచి ముందస్తు ప్రొ॥జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో మొదటిరోజు ఆయాపాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. మండల కేంద్రమైన బాలుర పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ హెచ్ఎంల సంఘం అధ్యక్షుడు జటప్రోలు శ్రీనివాస్‌రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ బిపాషా, పాఠశాల హెచ్ఎంశ్రీనివాసులు,ఉపాధ్యాయులు సత్య నారాయణ, గాజుల వెంకటేష్, చందన,సంగీత, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్టఅనంతరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ఆలూరి శ్రీనివాసులు,పాఠశాల విద్యార్థులతల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉప్పునుంతల బాలుర పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

## ఆటవిడుపులకిక స్వస్తి.. పుస్తకాలతో విద్యార్థుల కుస్తీ

- యాభై రోజుల విరామం తర్వాత మోగిన బడిగంట
- జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన పాఠశాలలు

**భూత్పూర్,జూన్ 12, ప్రభాతవార్త:** యాభై రోజుల సుధీర్ఘ విరామం తర్వాత రాష్ట్రమంతటా గురువారం నుంచి పాఠశాలలు పున:ప్రారంభమయ్యాయి. గురువారంనుంచి బడిగంట మోగనుంది. వేసవి సెలవుల్లో ఆటవిడుపులు,ప్రయాణాలకిక స్వస్తి పలికిన విద్యార్థులు పలకా బలపాలు,పుస్తకాలతో కుస్తీ పట్టనున్నారు. తొలకరితో పులకరించిన విద్యార్థుల తల్లితండ్రులైన రైతులు విత్తనాలు,ఎరువుల కోసం కుస్తీ పట్టారు. ఇదే తరహాలో తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ఏ పాఠశాలలో చేర్పిస్తే బావుంటుందని తమ పిల్లల్ని వెంటేసుకుని మేలైన వంగడాల కోసం ఏ రకంగానైతే తిరిగారో ఇదేరకంగా ఎంత డునేషన్,ఫీజు కట్టయినా సరే మంచి పాఠశాలలో అడ్మిషన్ తీసుకోవాలని తపన పడి పోటా పోటీగా ప్రైవేట్ బడుల్లో చేర్పించేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఓ వైపు ప్రైవేట్ బడుల మైకుల మోతలు,మరో వైపు సర్కారు బడుల ఉపాధ్యాయులు,హెచ్ఎంల బడిబాటలు విద్యార్థుల తల్లితండ్రులను మభ్యపెట్టి,మతిపోగొట్టే స్థితికి చేరుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆరేళ్ల వయసున్న ప్రతి పిల్లవాడిని, బాలికను సర్కారు బడిలో చేర్పించాలని ప్రభుత్వం చేపట్టిన బడిబాటలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు,ఉపాధ్యాయులు ఈ నెల 3నుంచి బడిబాట పేరుతో గల్లీ గల్లీ తిరుగుతూ విద్యార్థుల్ని సర్కారు బడుల్లో చేర్పించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తుండగా, ఇదే కోవలో బుధవారం నుంచి మూడేళ్ల నిండిన చిన్నారుల్ని అంగన్‌వాడీలలో చేర్పించాలని ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులు, అంగన్వాడీ ఉపాధ్యాయులు ఇల్లిల్లూ తిరుగుతూ చిన్నారుల తల్లి తండ్రుల్ని మోటీవేట్ చేస్తున్నారు. ఇక ఇంతకు రెట్టింపు ఉత్సాహంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బస్సులు, వ్యాన్లు, ఆటోలలో మైకులతో తమ పాఠశాలలో అన్ని హంగులు, సదుపాయాలున్నాయని హోరెత్తిస్తూ విద్యార్థులు వారి తల్లితండ్రుల్ని తమ వైపు తిప్పుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. చేసేది లేక ప్రైవేట్ అడ్వర్‌టైజ్‌తో విసుగెత్తి తల్లితండ్రులు ఈ పాఠశాలల్లో ఏ మేరకు తమ పిల్లలకు విద్యానేర్పుతారోనని తల్లితండ్రులు ఎక్కడ ఏ పాఠశాలల్లో తమ పిల్లల్ని వేస్తే బాగుపడుతారోనని తమను తాము మనస్సులో బేరీజు వేసుకుంటున్నారు, చివరకు ఓ కొలిక్కివచ్చిన తల్లితండ్రులు తమకునచ్చిన పాఠశాలను ఎంచుకుని తమ పిల్లల్ని ఆయా పాఠశాలల్లో ప్రవేశం తీసుకున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న కొన్ని పాఠశాలలు తల్లితండ్రులకు భారాన్ని కల్గించే ఫీజుల్ని విద్యార్థుల తల్లితండ్రులపైన మోపేందుకు తమ చేతివాటం బాగానే చూపిస్తున్నారని విద్యార్థుల తల్లితండ్రుల ద్వారా తెలుస్తోంది. అడ్మిషన్ల పేరిట,పుస్తకాల పేరిట,నోటు బుక్కుల పేరిట విద్యార్థుల తల్లితండ్రుల నుంచి వేలకు వేలు గుంజుతున్నారని తెలిసింది. యాభై రోజుల పాటు పాఠశాలలకు పట్టిన బూజుల్ని దులిపేసి,పాఠశాలల తరగతి గదులు,ఆఫీసు గదుల్ని శుభ్రం చేసుకుని విద్యార్థుల రాక కోసం ఆయా పాఠశాలల యాజమాన్యాలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నాయి. ఇక యాభై రోజుల పాటు మూలన పడేసిన పుస్తకాల బ్యాగును,పెన్నుల కంపాక్స్‌లను విద్యార్థులు శుభ్రం చేసకుని గురువారం నుంచి తెరుచుకోనున్న పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు సన్నద్ధమయ్యారు.

## 23న జర్నలిస్టుల రిలే దీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

**టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకిటి అశోక్ కుమార్**

**మహబూబ్‌నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో ఇండ్లు రాని నిరుపేద జర్నలిస్టుల కోసం ఈ నెల 23 వ తేదీ నుండి ధర్నా చౌక్ వద్ద రిలే దీక్షలు చేపడుతుందని టిడయుబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకిటి అశోక్ కుమార్ తెలిపారు. గురువారం మహబూబ్‌నగర్‌లోని టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్న ఎన్నికల ముందు జర్నలిస్ట్ లకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లో విఫలమైందని మండిపడ్డారు. ఇండ్లు రాని నిరుపేద జర్నలిస్టులకు ఇండ్లు అందివ్వాలని ఇప్పటికే కలెక్టరుకు స్థానిక ఎమ్మెల్యేకు పలుమార్లు వినతి పత్రం అందజేసిన ఫలితం దక్కలేదన్నారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయకుమార్,ఫౌండర్ యాదగిరి లు మాట్లాడుతూ మహబూబ్ నగర్ పాలకులు నిరుపేద జర్నలిస్టుల ఇండ్ల కేటాయింపు పట్ల నిర్లక్ష్య ధోరణి తగదన్నారు. వాస్తవానికి బిపిఎల్ కింద దక్కాల్సిన ఇండ్లు అనర్హులకు దక్కినప్పటికిని ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యమా పాలకుల అసమర్ధత నా అర్థం కావడంలేదని విచారం వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 25లో ఎస్‌విఎస్ గుట్టపై అనర్హులను గుర్తించి వారి పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొహమ్మద్ రఫీ, పరిపూర్ణం మాట్లాడుతూ పేద జర్నలిస్టుల కోసం నిర్వహించే రిలే నిరాహార దీక్షలకు మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని నిరుపేద జర్నలిస్టులంతా ఇండ్లు రాని వారు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జర్నలిస్ట్ ఫెడరేషన్‌కు వ్యతిరేకంగా పనిచేసిన పలువురిని సస్పెండ్ చేస్తూ సమావేశంలో తీర్మానించినట్లు బండి విజయకుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొలకల పల్లి గోపాల్,ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు పసుపుల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ గండేటి నరసింహ,నాయకులు రామకృష్ణ,లెనిన్ నరసింహులు, మహిపాల్‌రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

## భారతదేశాన్ని మొదటి స్థానంలో నిలబెట్టడమే మోడీ లక్ష్యం

**సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి**



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు డి.నారాయణ

**వనపర్తి రూరల్, జూన్ 12 ప్రభాతవార్త:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ ను మొదటి స్థానంలో నిలబెట్టడం నరేంద్ర మోదీ ముందున్న లక్ష్యమని బిజెపి నాయకులు మెంటే పల్లి పురుషోత్తం రెడ్డి పేర్కొన్నారు. గురువారం బిజెపి మండల అధ్యక్షుడు సంద వెంకటేష్ అధ్యక్షతన చిట్యాల క్రాస్ రోడ్స్‌లోని డిఎస్ కన్వెన్షన్ హాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలనపై మండల కార్యశాల నిర్వహించడం జరిగింది. ఈ కార్యాశాలకు ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ మోడీ పాలనలో రాష్ట్రానికి పిఎం కిసాన్ సమ్మన్ నిధి పథకం ద్వారా 31 లక్షల రైతులకు ఏడాదికి 6000/లు, రైతులకు పెట్టుబడి సాయం, ముద్ర యోజనలో 76 లక్షల లోన్ ఖాతాల ద్వారా 72,000 కోట్ల నిధులు, పీఎం జన్ ధన్ యోజన కింద 1.27 కోట్ల ఖాతాల్లో 5,157 కోట్లు నిధులు ఉన్నాయని పీఎం స్వనిధి పథకం 4,26,257 లబ్ధిదారులకు 1226 కోట్లు పీఎం ఆవాస్ పట్టణ యోజన ద్వారా 2.4 లక్షల ఇల్లు నిర్మాణం ప్రారంభమై 2.2 లక్షల నిర్మాణం పూర్తయ్యాయని 6150 కోట్ల ఆర్థిక సహాయం మంజూరై 3806 కోట్లు విడుదలయ్యాయని, పీఎం గ్రామ సడక్ యోజన కింద 4948 కోట్ల నిధులతో 14,331 కి.మీ. రోడ్లు మంజూరై 12,800 కి.మీ. పూర్తయ్యాయని,383 వంతెనలు పూర్తయ్యాయని జాతీయ రహదారులు 2019 నుండి 2025 వరకు 19000 కోట్ల వ్యయంతో 1488 కి.మీ రోడ్డు నిర్మాణం అయిందని 60 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో అరకొరగా జరిగిన అభివృద్ధి మోడీ హయాంలో 100రెట్ల వేగంతో అభివృద్ధి జరుగుతుందని అన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా 82,59,718 కార్డులు జారీ అయ్యాయని గత 30 రోజులలో 6268 కార్డులు ఇచ్చామని ఉజ్వల యోజన పథకం ద్వారా మహిళలకు 11, 84,203 ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందించామని, పీఎం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద అంత్యోదయ అన్న యోజన ద్వారా 5.67 లక్షల కుటుంబాలకు మొత్తంగా 1.9 కోట్ల మందికి లబ్ది చేకూరిందని, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పథకంలో 55 లక్షల క్రియాశీల కార్మికుల ద్వారా 2020 నుండి 63 లక్షల ఆస్తులు నిర్మించి 22 వేల కోట్లు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి చట్టం



రెవెన్యూ సదస్సులు మాట్లాడుతున్న తహసీల్దార్ మల్లికార్జున రావు

**గండిడ్, జూన్ 12 ప్రభాతవార్త:** భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, భూ సమస్యల సత్వర పరిష్కారానికి భూభారతి చట్టం ఎంతో దోహదపడుతుందని గండిడ్ మండల తహసిల్దార్ మల్లికార్జున రావు అన్నారు. గురువారం, గండిడ్ మండల పరిధిలోని కొమ్మిరెడ్డి పల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సదస్సులో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మల్లికార్జున రావు మాట్లాడుతూ భూ సమస్యలున్న ప్రతి ఒక్క రైతూ రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఏ రకమైన భూ సమస్యలు ఉన్నా వాటి సత్వర పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, జూన్ 12 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అర్చకుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి అర్చకుల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ, మంత్రివర్యులు శ్రీహరి, శాసనసభ్యురాలు పర్ణిక రెడ్డి ల చిత్ర పటాలకు గురువారం అర్చకుల పేట జిల్లా అధ్యక్షులు జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ అర్చకులకు గ్రాట్యూటీ,విద్య రుణం, దహన సంస్కారాలకు ఖర్చు పెంపు, తదితర సంక్షేమ ఫలితాలు అందిస్తున్న సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు తిప్పయ్య స్వామి, శరణయ్య స్వామి, ప్రభుస్వామి, నర్సింహా పటేల్, వినోద్, విశ్వనాథ్‌తో బాటు తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కి కృతజ్ఞతలు తెలిపిన పేట ఎమ్మెల్యే

**నారాయణపేట టౌన్, జూన్ 12 ప్రభాతవార్త:** నారాయణపేట శాసన సభ్యురాలు డా.పర్ణిక రెడ్డిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు గురువారం టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ని కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తూ శాలువాతో సన్మానించారు. అనంతరం పేట ఎమ్మెల్యే పర్ణికరెడ్డి టిపిసిసి అధ్యక్షునితో పలు అంశాలపై చర్చించారు.



## ఉండవల్లి ఎస్ఐగా శేఖర్

**మానవపాడు, జూన్12 ప్రభాతవార్త :** ఉండవల్లి మండల నూతన ఎస్సైగా ఆర్.శేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరిం చారు. జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయంలో విఆర్‌గా పనిచే స్తూ బదిలీపై ఇక్కడ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై మహేష్ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల కన్నా.. ప్రభుత్వ పాఠశాలలు మిన్న

**ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఒత్తిడి ఉండదు**

**కాంగ్రెస్ సీనియర్ నాయకులు, న్యాయవాది కావలి గోవింద్ నాయుడు**

**పెబ్బేరు, జూన్ 12 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం వై శాఖపూర్ గ్రామంలో బడిబాట కార్యక్రమంలో పాఠశాల నుంచి ఊరి వరకు ర్యాలీ తీయడం జరిగింది. గ్రామ ప్రజలకు సమావేశం నిర్వహించి కావలి గోవింద నాయుడు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలను మిన్న అనే అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ఒత్తిడి లేకుండా అనుభవజ్ఞులైన టీచర్లు బోధించడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ పాఠశాలల డ్రెస్ కోడ్ను చూసి హంగు ఆర్భాటాలను చూసి మోసపోవద్దని తల్లిదండ్రులకు ఈ సందర్భంగా సూచించారు. మన పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడాలని చాలామంది తల్లిదండ్రులు ఇంటిదగ్గర ఉంచుకుంటే చెడిపోతారని ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కావలి గోవింద నాయుడు ఒక్కరు ఒక్కరికి 5000 చొప్పున పై చదువుల కోసం నగదు అందజేశారు స్కూల్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన మీనాక్షి అలాగే వసుంధర రామ్ చరణ్ పల్లవి లావణ్య మేనక స్వాతి శివ విద్యార్థులకు నగదు అందజేశారు. గవర్నమెంట్ స్కూల్ లలో గవర్నమెంట్ కాలేజీలలో చదివిన వారు ఐఏఎస్ లు ఐపీఎస్‌లు అయ్యారు. ప్రైవేట్ స్కూల్లో చదువుకున్న మన పిల్లలు వాళ్లు పెట్టే ఒత్తిడి వల్ల పెద్ద పెద్ద జాబులు పొందలేకపోతున్నారు. శాఖాపూర్ గ్రామంలో విద్యార్థిని విద్యార్థినిలు పదిమంది డాక్టర్ చదివిన ఐఏఎస్, ఐపీఎస్‌లు చదివిన చదివిస్తానన్నారు. గ్రామంలోనే ఉండి గ్రామ ప్రజలకు సేవ చేసుకుంటానని అన్నారు. పేదలు అనారోగ్యం పాలైన వైద్య ఖర్చులు భరిస్తానన్నారు. ఎంతో మందికి సాయం చేసే శక్తి దేవుడు తనకి ఇచ్చాడని చెప్పుకొచ్చారు. అనంతరం పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నగదును ప్రోత్సాహకంగా అందించారు. అధ్యాపకులు, గ్రామ పెద్ద మనుషులు సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోవింద్ నాయుడుతో పాటు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుట్టా తిరుపతయ్య, జక్కుల శీను, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ యాదవ్, ఎరుకల హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లుమన్ బలరాం, చిన్న స్కూల్ అధ్యాపకులు, పెద్ద స్కూల్ అధ్యాపకులు, కాంగ్రెస్ నాయకులు,యువకులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



బడిబాట సభ సందర్భంగా సరస్వతి దేవికి పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

